# అడ్డదారి

ప్రతాపరావు ప్రసిద్ధి అతను ఈ పట్నం బదిలీమీద రాకముందే ప్రయాణం చేసింది. ఒక కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక సంస్థకు పెద్దగా ఛార్జి తీసుకున్నాక పరిపాలనా పద్ధతులనే మార్చేడు. అతని పరిపాలనా శైలిని అర్థం చేసుకుని ఆచరించడానికి దిగువ ఆఫీసర్లు కొద్దిరోజులు తికమకపడ్డారు. తను అనెస్టుగా ఉండటమే కాదు, అలా తన సంస్థ అంతా ఉందని వచ్చిన రెండు నెలల్లోనే ప్రజలకు చాటగలిగాడు.

ఏ ఫైలునూ ఇన్ ట్రేలో ఉంచని ప్రతాపరావు ఒకసారి ఒక ఫైలును పెండింగ్ ట్రేలో పడేశాడు. వారం రోజులైనా ఇంకా అక్కడే ఉంటే అతని పెర్సనల్ అసిస్టెంట్ ఫైలును ఇన్ ట్రేలో వేశాడు. ఆ రోజు ఉదయమే అతనిని పిలిచి – "ఈ ఫైలు ఇక్కడి కెలా వచ్చింది?" అని అడిగాడు.

"పెండింగ్ ట్రేలో మరిచిపోయి వదిలారని మళ్ళీ అక్కడ పెట్టాను."

"ఇందులో నీ అభ్యర్థి ఎవరైనా ఉన్నారా?"

"అబ్బే, లేరండి."

మళ్ళీ ఫైలును పెండింగు ట్రేలో పడేశాడు. ఆ మరుసటి వారం ఆ ఫైలు గురించే తనకు బాగా తెలిసిన ఒక పెద్ద హోదాలో ఉన్న వ్యక్తే ఫోను చేశాడు. ఇంకో రెండు రోజుల్లో తన కింద ఆఫీసర్లు ఇద్దరు మరి కొన్ని వ్యవహారాలు మాట్లాడాక ఈ ఫైలు గురించే అడిగారు. లేడీస్ క్లబ్ నుంచి వచ్చిన ప్రతాపరావు భార్య "అంత సస్పెన్స్‌లో ఎందుకు పెట్టేస్తారు, అవునో కాదో తేల్చేకూడదా?" అంది.

ఇన్ని రికమెండేషన్లకు నోచుకున్నది ఈ ఫైలు. తను పసికట్టినట్లే ఇందులో ఏదో కుంభకోణం ఉండి ఉండాలి. తన న్యాయబుద్ధికి అంగాలుగా పెట్టుకున్న ఆఫీసర్లనే నమ్మలేని పరిస్థితి రాగానే మనసులో పెట్టుకుని బాధ పడే బదులు ఆ రిక్రూట్‌మెంటు బోర్డులో ఉన్న ముగ్గురు ఆఫీసర్లని పిలిచాడు.

"మీ ముగ్గురిలో అప్పుడే ఇద్దరు ఈ ఫైలు గురించి అడిగారు. ఎప్పుడైతే సెలక్షను అయిపోయిందో అప్పుడే మీ పని పూర్తయింది కదా?"

"పూర్తి కాలేదు సార్! వాళ్ళు రాసే పేపర్లు దిద్దాక, వాళ్ళు ఇచ్చిన జవాబులు

విన్నాక మనసులో కొన్ని మమకారాలు ఏర్పడతాయ్. అందులో ఫలానా వాడ్ని నా సెక్షన్‌లో వేస్తే నా పని కొంత సులువవుతుందన్న ఆశతో అడిగాను" అన్నాడు ఇదివరకు ఆ ఫైలు గురించి అడిగిన ఒక ఆఫీసరు.

"ఈ అయిదుగురూ అంత తెలివైనవాళ్ళా?"

"అనుమానమైతే మీరే వాళ్ళని పిలిపించి ఇంటర్వ్యూ చెయ్యండి" అన్నాడు ఇంతవరకూ అడగని మూడో ఆఫీసరు సుధాకర్.

"వాళ్ళు ఉత్తి చవటలైతే. . ."

"ఎదుటివాళ్ళ తెలివితేటలు పరీక్షించి తీర్పు చెప్పేటప్పుడు పరీక్షించే వాడి తెలివితేటలను కూడా దృష్టిలో పెట్టుకోవాలి. నిజాయితీ ఎవరి సొత్తయినా కాగలదు. ఒక్కరిదే కాదు సార్" అన్నాడు సుధాకర్ వినయంగానే.

ప్రతాపరావు ఒకసారి కళ్ళు నిలబెట్టి సుధాకర్ వేపు చూసి, "ఇలా మాట్లాడి నీ మీద నాకున్న గౌరవాన్ని పెంచుకున్నావు, కీపిటప్" అని ముగ్గుర్నీ పంపేశాడు.

ఆ వారంలోనే ఒక రోజున అయిదుగురు అభ్యర్థులు వచ్చి ప్రతాపరావు ముందు నిలుచున్నారు. ఏభయి మందిని వడబొయ్యగా ఉత్తీర్ణులైనవారు ఈ అయిదుగురు. వాళ్ళ నుద్దేశించి -- "మీ అయిదుగుర్నీ విడివిడిగా కొన్ని ప్రశ్నలు వేస్తాను. నాకు కావలసింది నిజం -- పూర్తి నిజం" అన్నాడు.

నలుగురు తలలూపారు. అయిదోవాడు మాత్రం అన్నాడు--

"మేం చెప్పే నిజాన్ని మా మీదే అస్త్రంలా ప్రయోగించరని హామీ ఇవ్వండి."

ప్రతాపరావు ఒకసారి అతని వేపు దీక్షగా చూసి "నీ పేరు" అని అడిగాడు.

"రాయలు."

"రాయలా?"

"మా నాన్నగారు నేను శ్రీకృష్ణదేవరాయలంత ఉన్నతికి వచ్చి ఏ ఐ.ఎ.ఎస్. ఆఫీసరో అవుతానని ఆ పేరు పెట్టారు. నేను బంటునైనా కాలేకపోయానని దిగులుతో శ్రీకృష్ణదేవరాయల పేరును ఎస్.కె.డి. రాయలని మార్చేశాను."

"రాయలు, కూర్చో" అన్నాడు.

మిగతా నలుగుర్నీ బయటకు పంపించాకే రాయలు ఎదరగా కుర్చీమీద కూర్చున్నాడు.

"నిజాన్ని నీ మీదే అస్త్రంలా ప్రయోగిస్తానన్న అనుమానం నీ కెలా వచ్చింది?"

"అయ్యా మనం ఏది మంచి, ఏది చెడు అన్నది! ఈనాటికీ మనుధర్మశాస్త్రం కొలబద్దగా తీసుకునే అన్వయిస్తాం. మీరు దాన్నే తీసుకుంటే...."

"నేను కొలవవలసినదేమిటో తెలుసుకోకుండా కొలబద్దలెలా నిర్ణయించుకుంటాను? అలా నిర్ణయించుకోవడానికే మీ అయిదుగుర్నీ పిలిపించాను. పూర్తి నిజం తెలిస్తే నిర్ణయం సులువు కదా! నిజం తెలుసుకోవడానికే నిన్ను నా దగ్గరగా కూర్చో పెట్టింది." అన్నాడు ప్రతాపరావు.

"అడగండి."

"నీ పేరు ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజి లిస్టులో ఎలా పడింది?"

"ఎన్నాళ్ళ నించో ప్రయాస పడుతున్నాను. ప్రతివారం ఒకసారి ఎక్స్చేంజికి వెళ్ళేవాడిని. ఇంకా సీనియార్టీ పంపడానికి రాలేదనేవారు. ఆ ఎక్స్చేంజి వరండాలోనే

ఒకసారి ఒకడు కలిసాడు. ఖర్చు పెడితే కానీ ఖ్యాతి రాదన్నాడు. అయిదు వందలు ఇస్తే పేరు పంపించే ఏర్పాటు చేస్తానన్నాడు. నా దగ్గర అంత లేదన్నాను. ఎంత ఉందన్నాడు. రెండు వందలు ఎలాగో అప్పుగా సంపాదించగల నన్నాను. ఆ రెండు వందలు ఇప్పుడు అడ్వాన్సుగా ఇయ్ అన్నాడు. మిగతా అప్పుడప్పుడు ఎడ్జస్టు చేసి ఇచ్చేస్తే ఆ సరికి పేరు పంపిస్తానని అన్నాడు. మొదట తటాపటాయించాను. ఈ పని చెయ్యకపోతే నా పేరు ఏ లిస్టులో పడదన్న అనుమానం రావడానికి చాలా కారణాలున్నాయ్."

"ఏమిటా కారణాలు? లంచం ఇవ్వకపోయినా పేరు ఎప్పుడో వస్తుంది కదా?"

"ఈ సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగానికి పంపిస్తాడని గ్యారంటీ ఎక్కడ? ఏ ప్రయివేటు కంపెనీకో నూరూ నూటయాభై జీతానికి పంపేవాడు."

"అసలు నీ లంచం ఆఫీసరుకు అందిందా?"

"ఎవరికి ఎంత అందిందో తెలీదు కానీ, వాళ్ళు అనడం మాత్రం అంతా పంచుకుంటామనీ, కొంత పెర్సంటేజి పైకి కూడా వెళుతున్నదనీ అన్నారు."

"ఇందులో నిజానిజాలు వూహాకే వదలేద్దాం. నీవు మాత్రం అయిదు వందలు మధ్యవర్తి ద్వారా లంచం ఇవ్వడం మాత్రం పూర్తి నిజం--అంతేనా?

"నేను అప్పు చేసి అయిదు వంద లివ్వడం పూర్తి నిజం."

"తరవాత ఏం జరిగింది?"

"పేరు గ్యారంటీ పడుతుందన్న హామీ కుదిరాక ఇంటర్వ్యూలో నెగ్గాలని రాత్రీ పగలూ జనరల్ నాలెడ్జి పుస్తకాలు, మరిచిపోయిన లెక్కలు చేసుకుంటూ ఉంటే ఇంకో కబురు వచ్చింది. మీ ఆఫీసులో గుమాస్తాకి ముడుపు చెల్లిస్తేకానీ జాబ్ గ్యారంటీ లేదన్నారు. తప్పదా? అంటే తప్పక సెలెక్టు అవ్వాలంటే తప్పదన్నారు. ఎంత ముడుపు అంటే? ఏడుకొండలవాడే నయం, ఎంత ఇస్తే అంత పుచ్చుకుంటాడు. ఇతనిది ఏనుగు దాహం కాదు. ఇచ్చిన డబ్బు పంచుకుంటే ఇంత రిస్కు తీసుకున్న తనకేం ఎక్కువ మిగిలిపోదన్నాడు. ఎంత అంటే అరు నెలల జీతం. అమ్మ బాబోయ్, అంత డబ్బులేదని వూరుకున్నాను. మొదట రిటెన్ ఎగ్జామినేషను అయ్యాక ఒకనాడు నాకు తెలిసినవాడే నా ఇంటికి వచ్చాడు. మాటల్లో మాటగా అతను చెప్పినదేమిటంటే, మీ ఆఫీసులో అన్నీ రికమెండేషన్లే అనీ, మీరు ఆనెస్టుగా ఉన్నా మీ కింది వాళ్ళు ఇంకా పాత పద్ధతులను మరచిపోలేదనీ చెప్పాడు. మాటలో మాటగా నీకు నిజంగా ఉద్యోగం కావాలంటే అరు నెలల జీతం అర్పణ చేసుకోవాలి, తప్పదు. తరువాత సుఖపడతావు కదా? నీ అదృష్టం బాగుండి ఆ సీట్లో నిన్నే వేస్తే ఇచ్చిన దానికి పది రెట్లు పుచ్చుకుంటావు అన్నాడు."

"ఒప్పుకున్నావా?"

"ఆ అయిదు ఖాళీలు వాళ్ళో వాళ్ళే సర్దుకుంటారు. నీవర కెక్కడ రానిస్తారని భయపెట్టేశాడు. అయినా నా దగ్గర డబ్బులేదన్నాను. ఛాన్సు వదిలేయకు బ్రదర్ -- మళ్ళీ నీ పేరు ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజి నించి తెచ్చుకోవటం అంత సులువా? తపస్సు చేసినా తెచ్చుకోలేవు. కావలిస్తే నేను మధ్యనుంటాను. ఉద్యోగం అయ్యాకే ప్రతి నెలా జీతం నా ద్వారా ఇచ్చేద్దువు గాని -- వాడి జాతివాడినని ఆ గుమాస్తా ఈ మాత్రం కన్సెషన్ ఇవ్వడానికి ఒప్పుకున్నాడన్నాడు."

"ఈ షరతుకూ ఒప్పుకున్నావా?"

"మీ ఆఫీసులో ఇదివరకు వాళ్ళలో వాళ్ళు సర్దుకోవటం పూర్తి నిజమని నమ్మకం నాకుంది. ఉద్యోగాన్వేషణకు ఆరేళ్ళనించి పడుతున్న బాధలు తలుచుకున్నాక సరే ననేశాను."

"అయితే ఆరు నెలలు జీతం లంచంగా ఇవ్వడానికి ఒప్పుకోవడం పూర్తి నిజం. తరవాత చెప్పడానికి ఇంకేమైనా ఉందా?"

"ఉంది, అసలైనదే ఉంది. అన్నిటికన్నా నన్ను కలవరపెట్టినది ఆ విషయమే."

"అదెప్పుడు జరిగింది?"

"ఇంటర్వ్యూ అయిన రాత్రే – నా ఫ్రెండ్ హడావుడిగా వచ్చి నన్ను బయటకు పిలిచి బ్రదర్, అంతా గందరగోళం అయిపోయిందన్నాడు. పేపరు బాగా రాశాను. ఇంటర్వ్యూలో అన్ని ప్రశ్నలకు జవాబులు కరెక్టుగా చెప్పాను. తప్పక సెలక్టు అవుతాననుకుంటే ఇలా అంటావేమని అంటే నువ్వు అలా అనుకుంటున్నావు. నిన్ను ఇంటర్‌వ్యూ చేసిన వాళ్ళు అలా అనుకోలేదు. సాయంత్రం నీ పేరు అయిదుగురిలో ఉండదని తెలిసి బోర్డులో ముగ్గురిలో ఒకణ్ణి కష్టంమీద పట్టుకుని బ్రతిమాలితే లాభం లేదనేశాడు. నోటివరకూ వచ్చిన ముద్ద జారిపోయిందని నాకే ఏడుపు వచ్చింది. గబగబ మన ఫ్రెండు గుమాస్తాగాడి దగ్గరకు పరుగెత్తాను. వాడూ వచ్చి "సార్, వాడు మా చుట్టం. నా మాట నీట ముంచకండి" అని బ్రతిమాలాడు. అప్పుడు అతగాడు లోపలికి వెళ్ళాడట. పెళ్ళాంతో ఏదో మాట్లాడి వచ్చి, అతని పేరు వేస్తే నా కొచ్చేదేమిటని అడిగాడట. మీరు డబ్బు తీసుకోరు. ఇంకేం ఇమ్మంటారని గుమాస్తా అడిగాడట. నా అన్నయ్య ఉన్నాడు – వాడికి అయిదుగురూ కూతుర్లే. నీ చుట్టమంటున్నావు. నీదీ, మాదీ ఒకటే జాతి కాబట్టి కట్నం లేకుండా మా అన్నయ్య మూడో అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే నా పేరు లిస్టులో వెయ్యడానికి ఒప్పుకుంటాడట. ఆ ఒప్పందం రాత్రే కావాలన్నాడట. అమ్మాయి ఎలా ఉంటుంది? గుడ్డా, నడ్డా? నలుపా, తెలుపా? పొట్టా, పొడవా? అని అడిగితే, అవన్నీ అడిగితే లాభం లేదురా అన్నాడు. వూఁ అంటే ఉద్యోగం వస్తుంది, లేదంటే లేదు – వూఁ అనేరా అన్నాడు."

"పిల్లను చూడకుండానే ఒప్పుకున్నావా?"

"ఒప్పుకున్నాను."

"ఒప్పుకున్నాకయినా ఆ పిల్ల ఎలాంటిదో తెలుసుకున్నావా?"

"తెలుసుకుని బాధపడటం తప్పించి ఏం చెయ్యగలను?"

"పిల్ల కురూపి అయితే పెళ్ళి చేసుకుంటావా?"

"ఏమైనా చేసుకుంటాను."

"చేసుకున్నాక భార్యను బాధ పెట్టావా?"

"పెట్టను."

"ఎందుకిలా తొందరపడి పొరపాటు చేశావు?"

"అయ్యా, మీ ప్రశ్న వింటూంటే ఏడుగురు రాజకుమారులు తెచ్చిన చేపలో ఒక ఎండని చేప గుర్తుకు వస్తూందండి."

"నువ్వు ఆ ఎండని చేపవా?"

"నిరుద్యోగి ఎండని చేపండి. ఏమే చేపా ఎందుకెండలేదంటే, నన్నెందుకు అడుగుతావు? ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీ నడుగంటాడు నిరుద్యోగి. ఎక్స్ఛేంజీ బాబూ ఎందుకీయన పేరు పంపలేదంటే – నన్నెందుకడుతావు? స్టేటు గవర్నమెంటువారూ మీరూ పెట్టిన వయసు నిబంధనల వలన ఆరు నెలల్లో గవర్నమెంటు సర్వీసుకే పనికి రాను – ఏమంటారంటే ఎలక్షన్లు ఇంకా దూరంగా ఉన్నాయి కాబట్టే కాస్త కటువుగా నన్నెందు కడుగుతావు సెంట్రల్ గవర్నమెంటు నడుగు అంటారు స్టేట్ గవర్నమెంటు వారు. సెంట్రల్ గవర్నమెంటు నడిగితే, ఈ సమస్య నీ ఒక్కని దృష్టితోనూ, నీ ఒక్క రాష్ట్రం దృష్టితోనూ ఎలా చూస్తాం? దేశం దృష్టితో ఈ సమస్యను పరిశీలించి పదేళ్ళలో ఈ సమస్యే లేకుండా చేస్తున్నామంటున్నారు. పదేళ్ళవరకూ ఆగితే నేనే కాదు, నా ఎముకలు కూడా కుళ్ళిపోతాయి. ఏం చెయ్యమంటారో చెప్పండి అంటే – చదువు ఉద్యోగాలకోసమే కాదు. ఉద్యోగాలు ఒక్క ప్రభుత్వమే ఇవ్వదు. నీ చాకచక్యం ఉపయోగించి ప్రైవేటు కంపెనీల్లో చూడు – లేకపోతే ఒక సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ పెట్టుకో – అనగానే, అయ్యా, సులువుగా చెప్పేవాళ్ళు చెయ్యటం కష్టమని తెలియని మూర్ఖులు కారండి. నాకూ మీలానే రెండు చేతులున్నాయి. మీరు పెట్టిన అర్హతలన్నీ కష్టపడి ఆర్జించాను. చేయవలసిన ప్రయత్నాలన్నీ చేస్తున్నాను. నాక్కావలసింది మాటలు కావు. మీకు కడుపు నిండా ఉంది కాబట్టి మాటలు చెప్పగలుగుతున్నారు. నీతులు వల్లిస్తున్నారు. మావి ఆకలి కడుపులు. మీ కాళ్లకు రాచ బాట నీతి బాట అయితే, మా లొటలొటలాడే కాళ్ళకు అడ్డదారే నీతి బాట."

"అడ్డదారిల్లో పడి ఏం చేశావ్?"

"లంచం ఇచ్చాను. ఇష్టం లేకపోయినా కురూపిని పెళ్ళి చేసుకుంటానన్నాను."

"నా నీతి కొలబద్దతో కొలిచి నీకు ఉద్యోగం ఇవ్వకపోతే ఏం చేస్తావ్?"

రాయలు నిదానంగా ప్రతాపరావు కళ్ళలోనికి ఒకసారి చూసి "ఆకలితో ఇన్ని ఉన్నతభావాలను సృష్టించగల మనసును కాల్చదలచుకోలేదు. ఇంత మనోహరమైన పచ్చని ప్రకృతినీ, ఆ మధ్య మెసలే అందమైన జంతు, పక్షి, మానవాకారాలను చూడగలిగే కళ్ళను బలవంతంగా ముయ్యదలచుకోలేదు" అని అన్నాడు.

"అయితే బతకడానికి ఏం చేస్తావ్?"

"ఏమైనా చేస్తానుగానీ బలవంతంగా చావను."

"చీమ కన్నంలో వేలు పెడితే కుడుతుంది."

"ఎవరి నీతి వారిది. మీరు ఎదుటివారి నీతిని అర్థం చేసుకోనంటే మీరు కూడా చీమ కాగలరు" అన్నాడు సూటిగా రాయలు.

"సరే, బయట కాస్సేపు కూర్చో" అన్నాడు ప్రతాపరావు. తరవాత పెర్సనల్ అసిస్టెంట్‌ని పిలిచి ఏదో చెప్పాడు. మిగతా నలుగురు పిలుపుకోసం ఆత్రుతగా ఎదురు చూస్తుంటే, అయిదుగురికీ ఒక్కసారే లోనికి రమ్మని గంట తరవాత పిలుపు వచ్చింది. అయిదుగురూ ఎదురుగా నిల్చున్నారు.

"రాయలూ, నీ పేపర్లు చూశాను. నీకు ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీలో ఆరేళ్ళ సీనియారిటీ ఉంది. రిటెన్ టెస్టులో ఫస్టు వచ్చావు. ఇక వోరల్ టెస్టులో

అంతా బాగా ఆన్సర్ చేశావు. లంచం ఇవ్వడానికి ఒప్పుకోకపోయినా, కురూపిని పెళ్ళాడనని చెప్పినా, నీకు ఉద్యోగం దొరికేదే. ఎందుకింత పొరపాటు పని చేశావ్?"

"అయ్యా! లంచం ఇవ్వకపోతే, కురూపిని పెళ్ళాడ్డానికి ఒప్పుకోకపోతే నా పేరు అందులో ఉండేది. కాదు. అందులో పేరు లేకపోతే మీ ఎదరగా నా నీతిని చెప్పుకునే అవకాశమే దొరికేది కాదు."

"సరే, అడ్డదారిలో పోయే మీ అయిదుగుర్ని పిలిచి కారెక్కిస్తున్నాను. మీరు మాత్రం ఇక అడ్డదారుల్లో పడి అన్యాయానికి పూనుకోరనీ, కారులో పోతున్న మీరు అడ్డదార్లలో నడిచిపోయే అభాగ్యులను ఆదరిస్తారనీ ఆశిస్తూ ఈ వేళనుంచే మీ అయిదుగురికీ ఉద్యోగం ఇస్తున్నాను" అన్నాడు ప్రతాపరావు. వాళ్ళ ఎదురుగానే ఆ పెండింగు ఫైలు మీద సంతకం పెట్టి 'అవుట్' ట్రేలో పడేశాడు.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 23-5-1979)

* * *